మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక

పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎడిటర్ : నంద కిషోర్ సంపుటి : 07 సంచిక : 359 ఆదివారం 18 - 05 - 2025 పేజీలు: 8 వెల: 4

## కర్నూలు ఎయిర్ పోర్ట్ లో ముఖ్యమంత్రికి ఘన స్వాగతం



4లో..

## ముంబైలో బాంబు బెదిరింపుల కలకలం

- ఎయిర్‌పోర్ట్, తాజ్ హోటల్‌లో పేలుళ్లంటూ హెచ్చరిక
- వెంటనే అప్రమత్తమైన పోలీసులు, విస్తృత తనిఖీలు




మన గళం, ముంబై నగరంలో నేడు తీవ్ర కలకలం రేగింది. ము ంబై అంతర్జాతీయ విమానాశ్రయం, ప్ర ఖ్యాత తాజ్ మహల్ ప్యాలెస్ హోటల్ కు బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ రెండు ప్రాంతాల్లో బాంబులు పెట్టినట్లు గుర్తుతెలియని వ్యక్తి నుంచి పోలీసులకు ఒక ఈ-మెయిల్ వచ్చింది. విమానాశ్రయం, తాజ్ హోటల్‌లో శక్తివంతమైన పేలుళ్లు జరుపుతామని

2లో..



## భారత్ సుంకాలపై మరోసారి డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు

మన గళం, న్యూఢిల్లీ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌తో వాణిజ్య సుంకాలను మరోసారి ప్రస్తావించారు. అమెరికా నుంచి దిగుమతి అయ్యే పలు రకాల వస్తువులపై భారత్ జీరో టారిఫ్‌ను ప్రతిపాదించిందని ఆయన పునరుద్ఘాటించారు. భారత్, అమెరికాల మధ్య వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు జరుగుతున్న తరుణంలో ఈ వ్యాఖ్యలు

2లో..

## కేదార్‌నాథ్‌లో కూలిన హెలికాప్టర్..!



మన గళం, కేదార్‌నాథ్ : ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్‌లో శనివా రం ఎయిమ్స్ రిషికేశ్ హెలి అంబులెన్స్ సర్వీస్‌కు చెందిన హెలికాప్టర్ క్రాస్ ల్యాండ్ అయింది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగనప్పటికీ.. హెలికాప్టర్ వెనుక భాగం కూలిపోయింది. విమానంలో ఉన్న ముగ్గురు వ్యక్తులు - పైలట్ (కెప్టెన్), ఒక వైద్యుడు, వైద్య సహాయకుడు సురక్షితంగా బయట పడ్డారు. ఎత్తైన ప్రాంతానికి విమానంలో వెళుతుండగా ఈ సంఘటన జరిగింది. అక్కడ హెలికాప్టర్ వైద్య అత్యవసర సేవలో పాల్గొంటున్నట్లు సమా చారం. హెలికాప్టర్ వెనుక

2లో..



## ప్రతి మూడో శనివారం శుభ్రతపై దృష్టి పెట్టాలి




- ఆగస్టు 15న ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తాం
- ప్రపంచం మెచ్చుకునేలా రాష్ట్రంలో యోగా కార్యక్రమాలు
- కర్నూలులోని రైతుబజార్‌ను రూ.6 కోట్లు కేటాయించి ఆధునీకరిస్తాం
- కర్నూలు జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన

మన గళం, కర్నూలు : రైతన్నలకు సీఎం చంద్రబాబు శుభవార్త చెప్పారు. కేంద్రం ఇచ్చే కిసాన్ సొమ్ములకు సరిసమానంగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేస్తామన్నారు. కర్నూలు జిల్లా, పాణ్యం నియోజకవర్గంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీ క్యాంప్ రైతుబజార్‌కు సీఎం వెళ్ళారు. అక్కడ రైతులు, పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడారు. కూరగాయల వ్యర్థాలతో ఎరువుల తయారు చేసే విధానాన్ని పరిశీలించారు. అనంతరం ధనలక్ష్మి నగర్‌లో ఉద్యానవన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలో పచ్చదనం పెంపొందించండని ఈ సందర్భంగా చంద్రబాబు రాష్ట్రప్రజలకు పిలుపునిచ్చారు. ప్రతినెలా మూడో శనివారం ఇళ్లు, పరిసరాల్లోని శుభ్రతపై దృష్టి పెట్టాలని కోరారు. కర్నూలు జిల్లాలో పర్యటిస్తున్న చంద్రబాబు.. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో భాగంగా ఈ మేరకు ప్రజలతో ప్రమాణం చేయించారు. రాష్ట్రంలో పచ్చదనం పెంపొందించాలని ప్రజలకు సూచించారు. ఉద్యోగులు కూడా ప్రతి మూడో శనివారం శుభ్రతపై దృష్టిపెట్టాలన్నారు. ప్రపంచం

2లో..





## నీ విజయం దేశానికే గర్వకారణం

### నీరజ్‌పై సీఎం ప్రశంసల జల్లు

మన గళం, అమరావతి : ప్రతిష్ఠాత్మక డైమండ్ లీగ్ టోర్నీలో 90 మీటర్ల జావెలిన్ విసిరి చరిత్ర సృష్టించిన జావెలిన్ త్రో స్టార్ నీరజ్ చోప్రాకుకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఆయన సాధించిన ఈ ఘనత ఎంతో గర్వకారణం అంటూ ప్రధాన

2లో..

## బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తా



- పాకిస్థాన్‌పై దౌత్యపరమైన ఒత్తిడి పెంచేందుకు భారత్ చర్యలు
- విదేశాలకు వెళ్లనున్న అఖిలపక్ష ఎంపీల బృందాలు
- పాక్ ఉగ్రవాద చర్యలను అంతర్జాతీయంగా బహిర్గతం చేయడమే లక్ష్యం

మన గళం, హైదరాబాద్ : పాకిస్థాన్‌పై దౌత్యపరమైన యుద్ధాన్ని కొనసాగించేందుకు భారత ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆపరేషన్ సిందూర్ అనంతరం పాకిస్థాన్‌పై మరింత ఒత్తిడి పెంచే లక్ష్యంతో, అఖిలపక్ష ఎంపీల బృందాలను విదేశాలకు పంపాలని నిశ్చయించింది. ఈ బృందాలు పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాద చర్యలను అంతర్జాతీయ వేదికలపై ప్రస్తావించి, ఆ దేశ నిజస్వరూపాన్ని బహిర్గతం చేయనున్నాయి. ఈ మేరకు మొత్తం ఏడు బృందాలను

2లో..

## కృష్ణమోహన్ రెడ్డి అరెస్ట్ సరికాదు



మన గళం, అమరావతి : ఏపీ లిక్కర్ స్కాంలో మాజీ ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డి అరెస్ట్ వ్యవహారంపై వైసీపీ అధికార ప్రతినిధి యాంకర్ శ్యామల స్పందించారు. ఆయనను అరెస్ట్ చేయడం సరికాదని, కృష్ణమోహన్ రెడ్డి అత్యంత నిజాయతీపరుడని, నిష్కల్మషమైన వ్యక్తి అని ఆమె పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె తన అభిప్రాయాలను వెల్లడించారు. కృష్ణమోహన్ రెడ్డి వ్యక్తిత్వం గురించి యాంకర్ శ్యామల మాట్లాడుతూ,

2లో..



## రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు

మన గళం, విజయవాడ : ఏపీ లిక్కర్ కేసులో రిటైర్డు ఐఏఎస్ ధనుంజయ్ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి పాత్రపై రిమాండ్ రిపోర్ట్‌లో కీలక విషయాలు సిట్ తెలిపింది. ధనుంజయ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి ఇతరులతో కలిసి లిక్కర్ సిండికేట్‌గా ఏర్పడ్డారని.. ఈ సిండికేట్‌లో ఉన్నతాధికారులతో పాటు పలువురు వ్యాపారులు, రాజకీయ నేతల బంధువులు ఉన్నట్లు గుర్తించింది సిట్. నిందితులు లిక్కర్ సిండికేట్ సభ్యుడు, ఏ1 రాజ్ కసిరెడ్డికి సన్నిహితులని.. స్కాంలో వచ్చిన ముడుపులు వేరే వారికి బదిలీల్లో కీలక పాత్ర పోషించారని సిట్ తెలిపింది. ఆర్డర్ ఆఫ్ సప్లై నిర్ణయాల్లో ఇతర నిందితులతో కలిసి

## మా ప్రభుత్వంలో మహిళా సంఘాలకు ప్రోత్సాహం



మన గళం, హైదరాబాద్ : దేశాన్ని గెలిపించిన శక్తి .. మహిళలదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇండియా, చైనా యుద్ధం జరిగినపుడు, 1971లో పాకిస్థాన్‌తో యుద్ధం జరిగిన సమయంలోనూ ఇందిరమ్మ మహిళా శక్తిని ప్రపంచానికి చాటారని గుర్తుచేశారు. ఇవాళ(శనివారం) జూబ్లీహిల్స్ జేఆర్‌సీ కన్వెన్షన్‌లో వి హబ్ విమెన్ యాక్సిలరేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమం ఆవరణలో స్వయం సహాయక సంఘాల మహిళల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి

2లో..

# ముంబైలో బాంబు బెదిరింపుల కలకలం

మొదటిపేజీ తరువాయి

హెచ్చరించాడు. దీంతో భద్రతా సిబ్బంది అప్రమత్తమైంది. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో కలిసి పోలీసులు రెండు ప్రాంతాల్లోనూ క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. గంటల తరబడి సాగిన ఈ సోదాల్లో ఎలాంటి అనుమానాస్పద వస్తువులు గానీ, పేలుడు పదార్థాలు గానీ లభించలేదు. అనంతరం, ఈ బెదిరింపు ఈ-మెయిల్ నకిలీదని విమానాశ్రయ పోలీసులు నిర్ధారించారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేందుకే ఆకతాయిలు ఇలాంటి చర్యలకు పాల్పడి ఉంటారని భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, భారతీయ న్యాయ సంహితలోని సంబంధిత సెక్షన్ల కింద గుర్తుతెలియని వ్యక్తిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ-మెయిల్ ఐపీ అడ్రస్ ఆధారంగా నిందితుడిని గుర్తించేందుకు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ ఘటనతో ఆయా ప్రాంతాల్లో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తనిఖీల అనంతరం అంతా సవ్యంగా ఉందని తెలియడంతో ప్రయాణికులు, హోటల్ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

# బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తా

మొదటిపేజీ తరువాయి

ఏర్పాటు చేయగా, అన్ని పార్టీలకు చెందిన ఎంపీలకు వీటిలో స్థానం కల్పించారు. మే 22, 23 తేదీల్లో ఈ బృందాలు విదేశాలకు బయలుదేరనున్నాయి. ఈ బృందాలు యూకే, ఫ్రాన్స్, బెల్జియం, జర్మనీ, ఇటలీ, డెన్మార్క్ దేశాల్లో పర్యటించనున్నాయి. తెలంగాణ నుంచి ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీకి కూడా ఒక బృందంలో చోటు దక్కింది. ఆయన బీజేపీ నేత బైజయంత్ జే పాండా నేతృత్వంలోని బృందంలో సభ్యుడిగా వ్యవహరించనున్నారు. ఈ బృందంలో నిషికాంత్ దుబే, ఫంగ్నోన్ కొన్యాక్, రేఖ శర్మ, సత్నామ్ సింగ్ సంధు, గులాం నబీ ఆజాద్ కూడా ఉన్నారు. వీరు యూకే, ఫ్రాన్స్, బెల్జియం, జర్మనీ, ఇటలీ, డెన్మార్క్ దేశాల్లో పర్యటించనున్నారు. ఈ అవకాశంపై అసదుద్దీన్ ఒవైసీ స్పందిస్తూ, "ఇది దేశానికి సంబంధించిన ముఖ్యమైన బాధ్యత. పాకిస్థాన్ ఉగ్రవాదానికి మద్దతిస్తున్న తీరును అంతర్జాతీయ సమాజానికి వివరిస్తాం. కేంద్ర ప్రభుత్వం అప్పగించిన ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించడానికి నా వంతు కృషి చేస్తాను. అంతర్జాతీయ స్థాయిలో పాక్ నిజస్వరూపాన్ని బయటపెడతాం" అని తెలిపారు. ఈ పర్యటన పార్టీలకు అతీతమైనదని, బయలుదేరే ముందు మరింత వివరణాత్మక సమావేశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

# కృష్ణమోహన్ రెడ్డి అరెస్ట్ సరికాదు

మొదటిపేజీ తరువాయి

"ఆయన ప్రజల పక్షాన నిలబడే గొప్ప నాయకులైన డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి గారు, ఆ తర్వాత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారితో కలిసి పనిచేశారు" అని తెలిపారు. ఈ ఇద్దరు నేతల సేవా సిద్ధాంతాలను కృష్ణమోహన్ రెడ్డి హృదయపూర్వకంగా అనుసరించారని, ప్రజలకు సేవ చేసే నాయకులకు సేవ చేయాలనే దృఢ నమ్మకంతో ఆయన జీవించారని ఆమె వివరించారు. "ఆయన వ్యక్తిత్వం ఎంత విశ్వసనీయమైందో, ఆయన విధేయత ఎంత నిజమైనదో అందరికీ తెలిసిన విషయమే" అని ఆమె వ్యాఖ్యానించారు. కృష్ణమోహన్ రెడ్డి త్వరలోనే విడుదల అవుతారని, తన నిర్దోషిత్వం ప్రజల ముందుకు స్పష్టంగా రాబోతుందని తనకు సంపూర్ణ విశ్వాసం ఉందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. సమాజానికి నిజాయితీ, విలువలతో సేవ చేసే వ్యక్తులు ఎంతో అవసరమని యాంకర్ శ్యామల అభిప్రాయపడ్డారు. అటువంటి వ్యక్తులలో కృష్ణమోహన్ రెడ్డి ఒకరని, ఆయన సేవలు అమూల్యమైనవని ఆమె పేర్కొన్నారు.

# భారత్ సుంకాలపై మరోసారి డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి



ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ, భారత్‌పై పలు ఆరోపణలు చేశారు. ప్రపంచంలోనే అత్యధికం సుంకాలు విధించే దేశాల్లో భారత్ ఒకటని ఆయన పేర్కొన్నారు. తమ దేశం నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై సుంకాలను 100 శాతం వరకు తగ్గించడానికి భారత్ అంగీకరించిందని ట్రంప్ వెల్లడించారు. భారత్‌తో వాణిజ్య ఒప్పందం విషయంలో తమకు తొందర లేదని, తమతో ఒప్పందం కుదుర్చుకోవడానికి అనేక దేశాలు ఆసక్తి చూపుతున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. గతంలో ట్రంప్ చేసిన ఇలాంటి వ్యాఖ్యలపై భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ స్పందించిన విషయం విదితమే. ట్రంప్ పేరును నేరుగా ప్రస్తావించకుండా, రెండు దేశాల మధ్య చర్చలు జరుగుతున్నాయని, ఇవి చాలా సంక్లిష్టమైన చర్చలని ఆయన అన్నారు. ప్రతి అంశంపైనా తుది నిర్ణయం తీసుకునే వరకు ఇవి కొనసాగుతాయని, వాణిజ్య ఒప్పందం ఇరు దేశాలకు పరస్పరం ప్రయోజనకరంగా ఉండాలని, అది ఖరారు అయ్యే వరకు దాని గురించి ప్రకటించడం తొందరపాటు అవుతుందని జైశంకర్ పేర్కొన్నారు.

# ప్రతి మూడో శనివారం శుభ్రతపై దృష్టిపెట్టాలి



మొదటిపేజీ తరువాయి



మెచ్చుకునేలా రాష్ట్రంలో యోగా కార్యక్రమాలు నిర్వహించబోతున్నట్లు చంద్రబాబు చెప్పారు. కర్నూలులోని రైతుబజార్‌ను రూ.6 కోట్లు కేటాయించి ఆధునీకరిస్తామని సీఎం చంద్రబాబు చెప్పారు. కర్నూలు ప్రజా వేదికలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంకా ఏం మాట్లాడారంటే.. "రాష్ట్రంలో 125 రైతు బజార్‌లు ఉన్నాయి. కాలక్రమంలో వాటిపై దృష్టి పెట్టలేదు. వీటిని ఆదర్శ రైతు బజార్‌లుగా తయారు చేస్తాం. 175 నియోజకవర్గాల్లో 175 రైతు బజార్‌లు ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధర, ప్రజలకు సరసమైన ధరలకు కూరగాయలు అందిస్తాం. మూడో శనివారం ఎవరూ ఆఫీసుల్లో పని చేయొద్దు. ఆఫీసును శుభ్రం చేసి పచ్చని చెట్ల కింద విశ్రాంతి తీసుకోవాలి. వైజాగ్‌లో ప్రధాని మోదీ ఆధ్వర్యంలో యోగా దినోత్సవంను ప్రపంచం మెచ్చేలా యోగా డే నిర్వహిస్తాం. సెల్ ఫోన్ ప్రభావం వల్ల పిల్లలు పెద్దలు అనారోగ్యానికి గురవుతున్నారు. యోగా వల్ల ఆరోగ్యంగా ఉంటారు." అని చంద్రబాబు అన్నారు

"ప్రపంచంలో ఏదీ వేస్ట్ కాదు. ప్రతి ఒక్కటీ విలువైనది. తడి చెత్త, పొడి చెత్త కాన్సెప్ట్ ను తీసుకొచ్చి పవర్ గ్రిడ్ కు శ్రీకారం చుట్టాను. ప్రస్తుతం ఇవి రెండు ఉన్నాయి. గత ప్రభుత్వం 84 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను రోడ్లపై వదిలేసింది. మంత్రి నారాయణకు అక్టోబర్ రెండో తేదీ నాటికి ఆ చెత్తను తొలగించాలని ఆదేశించా. ఇప్పటి వరకూ రోడ్లపై 54 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను తొలగించారు. మెప్మా డ్వాక్రా సంఘాలను సమన్వయం చేస్తా. సుధారాణి అనే మహిళ మిద్దె తోటలపై ప్రపంచ వ్యాప్తంగా విప్లవం తీసుకొచ్చారు. డ్వాక్రా సంఘాల ద్వారా ప్రపంచానికి ఆడ బిడ్డల శక్తి ఏమిటో తెలియజేశాం. చెత్త నుంచి కంపోస్టు ఎరువులను తయారు చేసి రైతులకు సప్లే చేసే బాధ్యత డ్వాక్రా సంఘాలకు అప్పగిస్తున్నా." అని చంద్రబాబు తెలిపారు.

"జపాన్ లో రోడ్లపై ఎక్కడ చెత్త కనపడదు. రోడ్లపై ఉన్న పేపర్లను ఇంటికి తీసుకెళ్లి డస్ట్ బిన్ లో వేయడం సామాజిక బాధ్యత. పల్లె పుష్కరిణి అనే కార్యక్రమం ద్వారా చెరువులు శుభ్రం చేసి చెరువు చుట్టూ పచ్చదనం ఉండేలా చూస్తాం. అనంతపురం జిల్లాలో ఓడిఎఫ్ గ్రామాలు సక్సెస్ అయింది. దేశంలోనే ఎక్కడా లేనిది మన రాష్ట్రంలో త్వరలో పేదల సేవలో అనే కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నా. త్వరలోనే దీపం పథకం లబ్ధిదారులకు డబ్బులు అకౌంట్‌లలో జమ చేస్తాం. డిఎస్సీ ద్వారా 16500 ఉద్యోగాలు స్కూల్‌లు ఓపెన్ చేసే లోపు పూర్తి చేస్తాం. ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ పాఠశాలలు తెరిచే లోగా తల్లికి వందనం ఇస్తాం. అని చంద్రబాబు చెప్పారు.

"నాకు ఎన్ని కష్టాలు వచ్చినా భరిస్తా.. కానీ ప్రజలకు కష్టాలు రానివ్వను. కేంద్రం రైతులకు ఇచ్చే అమౌంట్కు సమానంగా మూడు విడతల్లో రైతుల అకౌంట్లో డబ్బులు జమ చేస్తాం. ఆగస్టు 15న ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తాం. నేను రాయలసీమ బిడ్డనే. రాయలసీమను రతనాల సీమ చేయడమే నా లక్ష్యం. రాయలసీమలో ఒకప్పుడు ఫ్యాక్షన్ సంస్కృతి ఉండేది. దానిని కూకటి వేళ్లతో పెకిలించా. దీనివల్ల అభివృద్ధికి అవకాశం ఏర్పడింది. రాయలసీమ నాలుగు జిల్లాల్లో నాలుగు ఏయిర్ పోర్టులు ఉన్నాయి. దేశంలో ఎక్కడా నాలుగు జిల్లాల్లో నాలుగు ఏయిర్ పోర్టులు లేవు. త్వరలోనే ఓర్వకల్లు మండలం లోని గ్రీన్ ఎనర్జీ సంస్థ నుంచి దేశ వ్యాప్తంగా కరెంటు సరఫరా కానుంది.

# కేదార్‌నాథ్‌లో కూలిన హెలికాప్టర్..!

మొదటిపేజీ తరువాయి

భాగాన్ని ప్రభావితం చేసే సాంకేతిక సమస్యల కారణంగా అత్యవసర ల్యాండింగ్ జరిగింది. గర్వాల్ కమిషనర్ వినయ్ శంకర్ పాండే ఈ సంఘటనను ధృవీకరించారు. పైలట్, ఆన్‌బోర్డ్ సిబ్బంది సకాలంలో స్పందించడం వల్ల ప్రాణనష్టం జరగలేదని సమాచారం. ఈ ఘటనపై ఎయిమ్స్ సీనియర్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ సందీప్ కుమార్ సింగ్ మాట్లాడుతూ.. కేదార్‌నాథ్‌లో ఒక రోగి కోసం హెలి-అంబులెన్స్ వెళ్లిందని. ల్యాండింగ్ సమయంలో సాంకేతిక లోపం తలెత్తిందని, ఈ ప్రక్రియలో హెలికాప్టర్ దెబ్బతిందని తెలిపారు. హెలికాప్టర్ వెనుక భాగం దెబ్బతిన్నట్లు చూపించే వీడియో కూడా బయటకు వచ్చింది. ఈ నెల ప్రారంభంలో అంటే మే 8న ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశి జిల్లాలో ఒక హెలికాప్టర్ కూలిపోవడంతో ఆరుగురు మరణించగా, ఒకరు గాయపడ్డారు. ఏడు సీట్ల హెలికాప్టర్ గంగోత్రి సమీపంలో కూలిపోయింది. ఈ సంఘటనను గర్వాల్ డివిజనల్ కమిషనర్ వినయ్ శంకర్ పాండే ధృవీకరించారు. సంఘటన జరిగిన వెంటనే, స్థానిక నివాసితులు మరియు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. అత్యవసర రెస్క్యూ బృందాలు సంఘటన స్థలానికి చేరుకున్నాయి.

# రిమాండ్ రిపోర్టులో కీలక విషయాలు

మొదటిపేజీ తరువాయి

ధనుంజయ్ రెడ్డి కీలకంగా వ్యవహరించారని రిమాండ్ రిపోర్టులో పేర్కొంది. డిస్టలరీస్ , మద్యం సరఫరాదారుల నుంచి ముడుపులు వసూలు చేసి ఇతర నిందితులతో పాటు అనేక మందికి బదిలీ చేశారని తెలిపింది. లిక్కర్ స్కాంలో ఏ1, ఏ1 సన్నిహితుల నుంచి వసూలు చేసి చివరికు ఎవరికి చేర్చారో గుర్తించాల్సి ఉందని వెల్లడించింది. సిండికేట్ సభ్యుల సమావేశాల్లో పాల్గొని ముడుపులు సకాలంలో అందేలా చూశారని సిట్ తెలిపింది. ఈ కేసులో ఏ1 రాజ్ కసిరెడ్డి, ఏ2 వాసుదేవ రెడ్డి, ఏ4 మిథున్ రెడ్డి, ఏ5 విజయ సాయిరెడ్డి, ఏ3 సత్య ప్రసాద్‌లతో కలిసి అనేక సమావేశాల్లో పాల్గొన్నారని.. ఏ1 కసిరెడ్డి కార్యాలయానికి పదే పదే వెళ్లి ముడుపుల వసూలు పరివేక్షించారని రిమాండ్ రిపోర్టులో పేర్కొంది.



# నీ విజయం దేశానికే గర్వకారణం



నరేంద్ర మోదీ సహా రాజకీయ ప్రముఖులు ప్రశంసలు కురిపిస్తున్నారు. తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నీరజ్ చోప్రా విజయంపై స్పందించారు. ఇంతటి ఘనత సాధించిన నీరజ్‌కు హృదపూర్వక అభినందనలు తెలిజేశారు. ఈ విజయం దేశానికి గర్వకారణమని చెప్పుకొచ్చారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో సీఎం చంద్రబాబు పోస్ట్ చేశారు. నీరజ్ చోప్రా మరోసారి తన పేరును చరిత్ర పుటల్లో లిఖించారు. 90 మీటర్ల మార్కు కంటే ఎక్కువ దోహా డైమండ్ లీగ్‌లో జావెలిన్ విసిరి దేశం గర్వించేలా చేశారు. నీరజ్‌కు ఈ ఘనత సాధించినందుకు హృదయపూర్వక అభినందనలు. ఈ మైలు రాయిని దాటడం ద్వారా భారత్ క్రీడా ప్రతిభ ప్రపంచానికి తెలుస్తుంది. నీరజ్ సాధించిన విజయం దేశానికే గర్వకారణం అంటూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు.

# మా ప్రభుత్వంలో మహిళా సంఘాలకు ప్రోత్సాహం



మొదటిపేజీ తరువాయి

రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. మహిళా శక్తిని కాంగ్రెస్ ఎప్పుడూ తక్కువ అంచనా వేయలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. దేశానికి మహిళలు ఆదర్శం మహిళా శక్తి దేశానికి అండ అని నిరూపించినా ఘనత కాంగ్రెస్‌దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా శక్తికి చేయూతనిచ్చే చాలా కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న సంకల్పంతో తమ ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించి మహిళలకు ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ నజరానా అందించారని గుర్తుచేశారు. మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ లాభాల బాటలో నడుస్తోందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల నిర్వహణను అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో ఆడబిడ్డలకు అప్పగించామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో స్వచ్ఛ ఆంధ్ర -స్వచ్ఛ దివస్ కార్యక్రమం




మన గళం,కర్నూలు వైద్యం : నగరంలోని స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్, డా.కె. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో తన ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించామన్నారు. అందులో భాగంగా ఆసుపత్రి ఆవరణలో ఉన్న న్యూ డయాగ్నస్టిక్ బ్లాక్ లో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు స్వచ్ఛ ఆస్పత్రి కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి అగ్రస్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్క వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. ఆసుపత్రి ఆవరణలోని న్యూ డయాగ్నస్టిక్ బ్లాక్ దగ్గర మొక్కలు నాటినట్లు తెలిపారుకర్నూలు వైద్య కళాశాల ప్రిన్సిపల్, డా.చిట్టి నరసమ్మ గారు మాట్లాడుతూ ఆసుపత్రి పలు విభాగాలలో శుభ్రంగా ఉన్నప్పుడే వ్యక్తుల ఆరోగ్యం కూడా బాగుంటుందన్నారు. అనంతరం వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. వైద్య విద్యార్థులతో వడ దెబ్బపై అవగాహన నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సీఎస్ఆర్ఎంఓ డా.వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్, సింధు సుబ్రహ్మణ్యం, రేడియాలజీ హెచ్ ఓ డి, డా.రాధా రాణి, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్, డా.శివ బాల నగాంజన్, డా కిరణ్ కుమార్, ఎస్ పి యం డిపార్ట్మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్, డా.అరుణ, నర్సింగ్ సూపరింటెండెంట్, సావిత్రిబాయి, మరియు ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ముఖ్యమంత్రిని కలిసిన కర్నూలు జిల్లా ఎస్పీ



మన గళం,కర్నూలు క్రైం : కర్నూలు నగరంలో స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు కర్నూలు ఓర్వకల్లు ఎయిర్ పోర్ట్ కు శనివారం విచ్చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య మంత్రిని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

# 19 వ తేదీ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

**– అర్జీల పరిష్కారం సమాచారం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ఫోన్ చేసి కనుక్కోవచ్చు**

**– జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా**

మన గళం,కర్నూలు కలెక్టరేట్ : ఈ నెల 19 వ తేదీ సోమవారం కర్నూలు కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులు స్వీకరించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం)కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అర్జీల పరిష్కారం సమాచారం కోసం 1100 కు ఫోన్ చేయవచ్చన్నారు. అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100 కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.. అలాగే అర్జీదారులు (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

## మినీ మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**– రాష్ట్ర మంత్రి టీ.జీ. భరత్**

మన గళం,కర్నూలు : ఆదివారం కర్నూలు నియోజకవర్గంలో మినీ మహానాడు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. నగరంలోని మౌర్య ఇన్ లోని శ్రీ ఆర్య ఫంక్షన్ హాల్ లో ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొనాలని ఆయన కోరారు.

## కే.యం.సి.లో బీట్ ది హీట్ స్కిట్



మన గళం,కర్నూలు వైద్యం : కె.యం,సి వైద్య విద్యార్థులచే వేసవి తాపం పై"బీట్ ది హీట్" స్కిట్ .. స్వర్ణ ఆంధ్ర..స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్ లో బాగంగా... ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రతినెల మూడవ శనివారం నిర్వహిస్తున్న "స్వర్ణ ఆంధ్ర...స్వచ్ఛ ఆంధ్ర.. స్వచ్ఛ దివస్" లో భాగంగా కర్నూల్ మెడికల్ కాలేజీ వైద్య విద్యార్థులు వైద్య కళాశాలలో హాస్పిటల్లో పరిసరాల పరిశుభ్రత, మొక్కల నాటడం, వేసవి ఎండల దృశ్య ప్రజలను జాగృత పరిచే కార్యక్రమంలో భాగంగా " బీట్ ద హీట్ " అంటూ న్యూ డయాగ్నొస్టిక్ బ్లాక్ యందు ఇంటర్న్స్ విద్యార్థులు చక్కటి స్కిట్ ప్రదర్శించడం జరిగింది. ఈ ప్రదర్శనలో వడదెబ్బ కొట్టినప్పుడు ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తమ ఇంటిలో, గ్రామం లో ఎటువంటి ప్రథమ చికిత్స చేసుకోవచ్చు, ఏ పరిస్థితుల్లో వెంటనే ఆసుపత్రికి తరలించాలి అన్న అంశాల గురించి వైద్య విద్యార్థులు తమ స్కిట్ యందు ప్రదర్శించడం జరిగింది. అనంతరం అందరిచే ప్రిన్సిపల్ స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. వైద్య కళాశాలలో మొక్కలు నాటడం, పరిసరాలను శుభ్రపరచడం జరిగింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కర్నూల్ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ కే చిట్టి నరసమ్మ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కే. వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్ లు డాక్టర్ సాయి సుధీర్ డాక్టర్ సింధియా శుభప్రద, సిఎస్ఆర్ఎమ్ఓ వెంకటేశ్వరరావు హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, నర్సింగ్ సుపరిండెంట్ సావిత్రి బాయి, కమ్యూనిటీ మెడిసిన్ హెచ్ ఓ డి డాక్టర్ సుధా కుమారి, రేడియాలజీ హెచ్.ఓ.డి. డా రాధారాణి, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అరుణ, అసిస్టెంట్స్ డా. రావినాయక్, డా. ప్రవీణ, లెక్చరర్ సురేష్ కుమార్, ఇంటర్న్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మన గళం,కర్నూలు : రవాణా కార్యాలయాల ప్రైవేటీకరణ ఆపాలని సిఐటియు ప్రధాన కార్యదర్శి , విజయ రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు, రవాణాశాఖ కార్యాలయాలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించరాదని కోరుతూ, ప్రైవేటు సంస్థలు ఏర్పాటు చేస్తున్న ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్ (ఏటిసి) సెంటర్ లను ఏర్పాటు చేయరాదని,సెన్సార్ ఫిట్నెస్ ట్రాకులను వెంటనే రద్దు చేయాలని కోరుతూ ఏపీ ఆటో%ు% ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ నగర ఉపాధ్యక్షులు దూదేకొండ కుమార్ అధ్యక్షతన స్థానిక సూర్జిత్ భవన్ లో ఆటో కార్మికుల సమావేశం జరిగింది. శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి ఎం విజయ రామాంజనేయులు,ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి పి మహమూద్ లు హాజరయ్యారు . ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ రవాణా రంగాన్ని కుదేలు చేసి కార్మికులను కార్పొరేట్ల కింద బానిసలుగా మార్చే విధంగా కూటమి ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించాలని,రవాణా కార్యాలయాలను ప్రవేటికరణ అడ్డుకోవాలని, నిరుద్యోగులకు లక్షల మందికి స్వయం ఉపాధినిచ్చే ట్రాన్స్ పోర్ట్ రంగాన్ని కాపాడుకోవాలని రానున్న రోజుల్లో జరిగే ఆందోళన కార్యక్రమాలను జయప్రదం చేయాలని రవాణా రంగంలో ప్రభుత్వం చేసిన అనేక మార్పులు వల్ల వాహన కార్మికులకు ఇబ్బందులుగా మారాయని అన్నారు, ఇప్పటికే రోజు రోజుకు పెరుగుతున్న నిత్యవసర సరుకుల ధరలు, ఆర్టిఏ చలానా రేట్లు,ఫైన్ లు, ఈ చలనాలు, సెన్సార్ చలానాలు,గ్రీన్ టాక్స్,రోడ్ టాక్స్ లు,పెరిగిన ఇన్సూరెన్స్ రేట్లు, పెరిగిన పెట్రోల్ డీజిల్ ధరల వలన ఈ ప్రభుత్వంపై ప్రజలు నమ్మకం సన్నగిల్లుతుందని వారు అన్నారు. ప్రభుత్వం నుండి ఎటువంటి సహకారం లేకపోయినా ఆటో కార్మికులు ప్రవేట్ ఫైనాన్సులను ఆశ్రయించి అధిక వడ్డీలను బరాయిస్తూ సమాజానికి సేవ చేయడమే కాకుండా ప్రభుత్వానికి ఆదాయాన్ని తెచ్చి పెడుతున్నారని గుర్తు చేశారు, అలాంటి సంస్థలను ప్రైవేటు సంస్థలకు అప్పగించి మోటార్ కార్మికుల స్వయం ఉపాధిని దెబ్బతీసి ఓలా ఉబర్ లాంటి కార్పొరేట్ సంస్థలకు రవాణా రంగాన్ని అప్పజెప్పాలని మొన్న రోడ్డు భద్రత చట్టం పేరుమీద కార్మికులకు జైలు శిక్ష పడి, లక్షల రూపాయలు ఫైన్లు పడే విధానాలను అనుమతించమే కాకుండా ఇప్పుడు ఆర్టిఏ కార్యాలయాలను ప్రైవేటు వారికి అప్పజెప్పడం మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్టు ఉందని అన్నారు,ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు ఇచ్చి ఓట్లు వేయించి కొని గెలుపొందిన కూటమి ప్రభుత్వం ఓటు వేసి గెలిపించిన ప్రజా కార్మికుల పక్షాన ఉన్నదా లేక లేక కార్పొరేట్ల వైపు ఉన్నదా వివరించాలని వారు డిమాండ్ చేశారు, పేదల పక్షాన కార్మికుల పక్షాన ఉంటే తక్షణమే ప్రైవేటీకరణ ఏ టి సి సెంటర్ల విధానాలను రద్దుచేసి, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు,లేదంటే ఆటో యూనియన్ సిఐటియు కార్మిక సంఘంగా ప్రభుత్వ వ్యతిరేక ఉద్యమాలు చేపడతామని వారు తెలియజేసారు,ప్రభుత్వము వెంటనే తమ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోకపోతే పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ నగర నాయకులు త్యాగరాజు రామకృష్ణ బడే భాష నాగరాజు బి.చంద్ర శేఖర్ మరియు ఆటో కార్మికులు పాల్గొన్నారు.

# యం.కె.మెన్స్ వేర్ ప్రారంభం



మన గళం,కర్నూలు సిటి : నగరంలోని స్థానిక ఎస్వీ కాంప్లెక్స్ లో యం.కె.మెన్స్ వేర్ ప్రారంభమైంది. శనివారం ఈ షోరూం ను హకీమ్,ఆసిఫ్ ల ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా విచ్చేసి వైకాపా కర్నూలు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి రిబ్బన్ కత్తిరించి, ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అనుబంధ సంస్థ నాయకులు, వైఎస్ఆర్పిపి నాయకులు , ఎస్వీ యూత్ పాల్గొన్నారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సంపాదకీయం

అసిస్టెంట్ ప్రొఫెసర్ల
నియామకాల్లో అన్యాయం

తెలంగాణలోని విశ్వవిద్యాలయాల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పద్ధతిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపడం అభినందించ దగ్గ విషయం. గత దశాబ్ది తెలంగాణలో విద్యావ్యవస్థ అభివృద్ధికి అనేక పరిమి తులు ఏర్పడ్డాయి. ప్రాథ మిక విద్య మొదలు ఉన్నత విద్యవరకు గత ప్రభుత్వం సరైన దృష్టి సారించలేదన్న విషయాన్ని గత ప్రభుత్వాన్ని గద్దె దించి తెలంగాణ సమాజం అర్థం చేయించింది. ఏ సమాజంలో నైనా విద్య మొదటి ప్రాధాన్యత అవ్వాలి. కానీ, మన రాష్ట్రంలో ఆ పరిస్థితి లేదు. కర్ణుని చావుకి సవాలక్ష కారణాలంటూ దీనికి అనేక కారణాలు న్నాయి.కానీ, వర్తమాన సమాజం ఈ పరిస్థితి మారాలని కోరుకుం టున్నది. ప్రపంచీకరణ ప్రభావం, పెట్టుబడి ప్రవాహం వల్ల విద్య ప్రాథమిక హక్కుగా, నైతిక బాధ్యతగా గుర్తించ బడటం లేదు. కేవలం ఒక పారిశ్రామిక రంగంగా తయారైంది. తెలంగాణ రాజధానిగా, మిని ఇండియాగా పిలవబడుతున్న హైదరాబాద్‌లో ఉన్నత విద్య ముఖ్యంగా ప్రయివేటు రంగం చేతుల్లోకి వెళ్లిపోయింది. ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యపై దృష్టిని కేంద్రీకరించడం లేదు. గత మూడు దశాబ్దాలుగా నెలకొన్న రాజకీయ, ఆర్థిక కారణాల వల్ల దేశవ్యాప్తంగా ఒక అసమ సమాజం ఏర్పడింది. దీనివల్ల పేద, మధ్య తరగతి వర్గాలకు నాణ్యమైన విద్య దూరమైంది, ఈ పరిస్థితి మారాలి. రాష్ట్రంలో ఉన్నత విద్యాశాఖ పరిధిలోని పన్నెండు విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి విధి, విధానాలను 4ఏప్రిల్ 2025 జీవో నెంబర్21 ద్వారా ఖరారు చేసింది. ఇది నియ మించిన ఉన్నతస్థాయి కమిటీ ఈ సిఫారసులను చేసినట్లు, వాటిని ఆమోదించినట్లు ప్రకటిం చింది. నిజానికి ఈ విశ్వవిద్యాలయాల్లో గత ఇరవైయేండ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్, పార్ట్ టైమ్ అధ్యాపకుల స్థానాన్ని నిర్ధారించకుండా రిక్రూట్‌మెంట్ ప్రస్తావన తీసుకురావడం ద్వారా గత నెలరోజులుగా వివిధ రూపాల్లో నిరసన వ్యక్తమ వుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇక జీవో 21ని క్షుణ్ణంగా పరిశీలిస్తే గనుక గతంలో ఉన్న నిబంధనల స్థానంలో మూడు దశల స్క్రూటినీ విధానాన్ని అనుసరిస్తూ విశ్వవిద్యాల యాలు ఖాళీలను భర్తీ చేయాలని ప్రతిపాదించింది. ఈ విధా నాలను ప్రతీ విశ్వవిద్యాలయం తమ పాలకమండలిలో ప్రవేశపెట్టి, ఆమోదించుకోవాల్సి ఉంటు ందని ఉన్నత విద్యామండలి సూచించింది. జీవో నెం. 21 అనుబంధం 1లో ఎ,బి,సి అనే విభజనల్లో స్క్రూటినీ విధా నాలను సూచించింది. ఈ మూడు దశల్లో అభ్యర్థి విషయ పరి జ్ఞానం, సబ్జెక్ట్ ప్రెజెంటేషన్, రీసెర్చ్ ఆప్టిట్యూడ్, వ్యక్తిత్వాల ఆధా రంగా మార్కులు కేటాయిస్తుంది. ఇది మా ర్కుల విభజన, స్క్రూటినీ విధా నం. ఇది సహజ న్యాయానికి, యూజీసి నిబంధనలకు పూర్తి విరుద్ధం

ఉన్నత విద్యామండలి ప్రతిపాదించిన స్క్రూటినింగ్ విధా నాలను లోతుగా గమనిస్తే అనేక లోటు పాట్లు ఉన్నాయనే విషయం అర్థమవు తున్నది. అసిస్టెంట్ ప్రొఫెసర్ల భర్తీకి సంబం ధించి ఇప్పటివరకు రెండు దశల స్క్రూటినీ పద్ధతినే పాటిస్తున్నారు. మొదటి దశలో ఎపిఐ స్కోర్ వంద మార్కులు, ఇంటర్వ్యూ, ప్రజం టేషన్‌కి యాభై మార్కులను కేటాయి స్తారు. ఈ పద్ధతినే చాలా వరకు కేంద్రీయ విశ్వ విద్యాల యాలు అనుసరిస్తున్నాయి. కానీ, తెలంగాణ ఉన్నత విద్యామండలి ప్రతిపాదిత కమిటీ రూపొం దించిన ఈ జీవోలో ఈ పద్ధతిని మార్చారు. స్క్రూటినింగ్ విధానాన్ని మూడు దశలకు పెంచి, ఎ- 50, బి - 30, సి - 20 అని మార్కులకు పరిమితం చేస్తూ, మిగతా వాటితో కలపకుండా వాటిని కట్టడి చేశారు. ఇది అనాలోచిత నిర్ణయం. ఇక ప్రతిపాదిత ‘ఎ’ దశలో పీహెచ్‌డీకి పది మార్కులు మాత్రమే కేటాయిం చారు. నిజానికి దేశవ్యాప్తంగా చాలా రాష్ట్రాలు, కేంద్రీయ విశ్వవిద్యాలయాలు అసిస్టెంట్ ప్రొఫె సర్ల నియామకాల్లో 25 నుండి 30 మార్కులను కేటాయిస్తున్నాయి. ఇక్కడ గమనించాల్సిన విషయమేమిటంటే అత్యున్నత డిగ్రీగా పేరు ఉన్న పీహెచ్‌డీ కన్నా, పీజీకి మార్కులు అధికంగా కేటాయించారు. ఇదెక్కడి విధానమో జీవో రూపకర్తలకే తెలియాలి.అలాగే బోధనాను భవానికి ఏడాదికి ఒక మార్కు చొప్పున గరిష్టంగా పది మార్కులిస్తున్నారు. అలాగేపోస్ట్ డాక్టోరల్, రీసెర్చ్ అసోసియేట్ షిప్‌లకి సంబంధించి ఐదు మార్కులు వేస్తున్నారు.ఇందులో అభ్యర్థి ముప్తై మార్కుల్లో సాధిం చిన మార్కుల ఆధారంగానే ప్రతి పాదిత సి దశలోకి 1:5 పద్ధతిలో ఎంపిక చేస్తామని ప్రకటించారు. దీనివల్ల నూత నంగా పీహెచ్‌డీ పూర్తి చేసుకున్న అభ్యర్థులు బోధన, పరిశోధా నుభవం విష యంలో తీవ్రంగా నష్ట పోతున్నారు. స్క్రూటినీ అనేది అభ్యర్థి మెరిట్ ఆధారంగా జర గాలి కానీ, ఇందులో అనుభవం పేరుతో స్క్రూటినీ జరుగుతుంది. ఇది సహజ న్యాయ సూత్రానికి వ్యతిరేకం. అలాగే ఎటువంటి వివక్షత చూపకుండా సమాన అవకాశాలు కల్పించే భారత రాజ్యాంగం ఆర్టికల్ 16కి ఈజీవో పూర్తి విరుద్ధం. ముప్తై మార్కుల్లో నూత నంగా పీహెచ్‌డీ పూర్తి చేసు కున్న అభ్యర్థి సహజంగానే పదిహేను మార్కులు కోల్పో తాడు. సగం మార్కులు కోల్పోయిన తర్వాత మిగతా పదిహేను మార్కులకు పోటీ పడి తర్వాతి దశలోకి ఎలా వెళ్లగలరు? ఇంత స్పష్టంగా సమస్య అర్థమవు తుంది. అభ్యర్థి మెరిట్‌ను ప్రతి పాదిత స్థానానికి సూచించిన అర్హతల్లో చూడాలి కానీ, అనుభవం ఏనాటికీ మెరిట్ కాజాలదు. ఈ అభ్యంతరం పట్ల ఈ జీవో రూపకర్తలు ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవ సరం ఉంది. అయినా విశ్వ విద్యాలయ స్థాయి అధ్యాపక స్థితికి మొదటి అడుగు (డోర్‌స్టెప్) అయిన అసిస్టెంట్ ప్రొఫెసర్ స్థానా నికి ఎక్స్‌పీరియన్స్‌ని ప్రధానం చేసి, ఈ మార్కుల తోనే స్క్రూటినీ చేస్తామని చెప్పడం అప్రజాస్వామికం. ‘బి’ దశలోకి వచ్చిన అభ్యర్థి మెరిట్‌ని పరిగణలోకి తీసుకోకుండా ”బోధనానుభవం, పరిశోధానుభవం” పేరుతో మార్కులను కేటా యించి, ఇంటర్వ్యూ దశలోకి పంపుతున్నారు. దీనివల్ల బోధన, పరిశోధనలపై మక్కువతో ఉన్న నూతన అభ్యర్థులకు ఉన్నత విద్యామండలి ప్రతిపాదించిన విధి, విధానాలే అడ్డంకిగా మారు తున్నాయి. వీరు అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్‌కి అనర్హులని నూటికి నూరు శాతం ప్రకటిస్తు న్నాయి. యూనివర్సిటీల్లో పనిచేస్తున్న పార్ట్ టైం అధ్యాపకుల బోధనానుభవాన్ని పరిగణలోకి తీసుకోవడం లేదు. విచిత్రమేమిటంటే యూని వర్సిటీ పరిధిలోని ప్రయివేటు కళాశాలల్లో పని చేస్తున్న వారికి సర్వీసును అంగీకరిస్తూ, మాతృ విశ్వవిద్యాలయాల్లో బోధన చేస్తున్నవారికి సర్వీసును పరిగణలోకి తీసుకోకపోవడం. వర్సిటీ పరీక్ష పెట్టి, ఇంటర్వ్యూ చేసి పార్ట్ టైమ్ బోధకులను ఎంపిక చేసింది. యూని వర్సిటీలు అధ్యాపకులను ఎంపిక చేసిన ఈ విధానం మంచిది కాదా? తనని తానే దోషి అని పిలుచు కుంటుందా? అనే విషయాలను తేల్చాల్సిన అవసరం ఉంది. అలాగే ఈ జీవోలో ప్రస్తావిం చిన ‘ఎ’ దశ స్క్రూటినీ విధానం ఆబ్జెక్టివిటీకి దగ్గరగా ఉంది. కానీ, బి, సి దశల్లో కేటాయించిన మార్కుల విషయంలో సబ్జెక్టివిటీ చోటుచేసుకునే అవకాశం ఎక్కువగా ఉంది. ఉన్నత విద్యా సంస్థల్లో బాధ్యతాయుతమైన అసిస్టెంట్ ప్రొఫె సర్ల నియామకం పారదర్శకంగా, న్యాయంగా జరగాలంటే ఈ జీవోలోని అంశాలను మరింత పారదర్శకంగా తయారు చేయాల్సిన అవసరం ఉంది. అప్పుడు మాత్రమే సమాజం కోరుకుం టున్న బాధ్యతాయుతమైన, సుశిక్షిత, ప్రతిభా వంతమైన అభ్యర్థులు బోధకులుగా మారే అవ కాశం ఉంటుంది. కనుక ఇలాంటి అప్రజాస్వామిక, సహజ న్యాయ సూత్రాలకు వ్యతిరేకంగా ఉన్న మూడు దశల స్క్రీనింగ్ విధానాన్ని, ఇతర అభ్యంతరాలను పరిగణలోకి తీసుకుని, మెరిట్ ఆధారంగా స్క్రూటినీ విధానాలను రూపొందిం చాలి. జీవో నెంబర్ 21ని వెనక్కి తీసుకోవాలి. తెలంగాణ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకానికి ప్రాతిపదికను తయారు చేయాలి.

## స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఎన్ఎండి ఫరూక్

మన గళం,నంద్యాల : నెలలో మూడవ శనివారం నిర్వహించే స్వర్ణ ఆంధ్ర %-% స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నేడు నంద్యాల ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఎన్టీఆర్ షాదికాన పక్కన ఉన్న ఫిల్టర్ బెడ్ పంప్ హౌస్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు .ఈ సందర్భంగా మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న పరిసరాలను మనమే పరిశు భ్రంగా ఉంచుకోవాలనే అంశంపై అవగాహన కల్పించేందుకు నేడు ప్రజలతో కలిసి నంద్యాలలో స్వర్ణ ఆంధ్ర %-% స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు . అనంతరం స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించారు . అనంతరం మొక్కల పెంపకం ద్వారా కాలుష్యాన్ని నివారించవచ్చనే ఆలోచనతో నంద్యాల ఫిల్టర్ బెడ్ పంప్ హౌస్ వద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు . అలాగే ఎండ ఎక్కువ ఉన్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వీలైతే తప్ప ప్రజలు బయటికి రావద్దన్నారు . ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి , ఎన్టీఆర్ షాది ఖానా చైర్మన్ అక్బర్ బాషా , టిడిపి 6 వార్డు ఇంచార్జ్ పల్లె



వెంకటసుబ్బయ్య , గోవింద నాయుడు , పబ్బతి వేణు , మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు , మున్సిపల్ ఎంఈ గుర్రప్ప , ఏఈ లు , డిఇ లు మరియు మెప్మా సిబ్బంది , కౌన్సిలర్లు , మాజీ కౌన్సిలర్లు , టిడిపి నాయకులు , కార్యకర్తలు , అభిమానులు , మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంట్రాక్టర్,ప్రైవేటు ఇంజనీర్ నిర్మాణ లోపం వల్ల గోడకూలి గాయాల పాలైన క్షతగాత్రులకు ఆర్థిక సాయమందించాలి

**– సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఎం.సత్యన్న**






మన గళం,ఎమ్మిగనూరు : ఎమ్మిగనూరు పట్టణంలోని కోసిగి రోడ్డు నందు ఎల్లమ్మ బీడు దగ్గర మూడు అంతస్తుల భవన నిర్మాణ దశలో కాంట్రాక్టర్ మరియు ప్రైవేటు ఇంజనీర్ జరిపిన నిర్మాణ రాహిత్య లోపాల వలన గాయాల పాలైన క్షతగాత్రులకు ఆర్థిక సహాయం అందించాలని సిపిఐ (ఎంఎల్ )న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు ఎం.సత్యన్న డిమాండ్ చేశారు. శనివారం నాడు స్థానిక ఎమ్మిగనూరు పట్టణంలోని మున్సిపల్ కమిషనర్ గారికి ఘటన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఎం.సత్యన్న మాట్లాడుతూ నిన్నటి రోజున(16.05.2025) శు క్రవారం రాత్రి 8 సమయంలో నిర్మాణం నందు గల మూడంతస్తుల భవనం నుండి ఒక గోడ కూలి పక్కనే ఉన్న పూరి గుడిసె రేకుల ఇళ్ల పై నేలకొరిగిందని అన్నారు. గుడిసెలే ఉన్న 14 మంది పేద ప్రజలు ఉమ్మడి కుటుంబంగా జీవనం సాగిస్తున్నారని తెలిపారు . మూడంతస్తుల భవనంలోని గోడ నేలకొరగడం వలన కురువ శ్రీరాములు గారి కుటుంబం నందు గల ఇద్దరు పిల్లలు పై తీవ్ర గాయాలై వారి పరిస్థితి విషమంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గాయపడిన ఇద్దరు చిన్నారులు లిఖిత,రుచిత కర్నూలు కేర్ హాస్పిటల్ నందు వైద్య చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో ఉన్నారని తెలిపారు. కురువ శ్రీరాములు కూడా తీవ్ర గాయాలయ్యాయని తెలిపారు. మిగిలిన కుటుంబ సభ్యులకు స్వల్ప గాయాలు వలన ప్రమాదం నుండి బయటపడ్డారని అన్నారు. నిర్మాణ బాధ్యత రహితంగా వ్యవహరించిన ప్రైవేటు ఇంజనీర్ మరియు కాంట్రాక్టర్ పై ఏమ్మిగనూరు మున్సిపాలిటీ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ ఇంజనీర్ వారి లైసెన్సును రద్దు చేయాలని కోరారు. బాధ్యతారహితంగా వ్యవహరించిన వారి నుండి క్షతగాత్రులకు తక్షణమే ఆర్థిక సాయం అందించాలని, నేలకొరిగిన పూరిగుడిసెకు మరమ్మత్తులు చేయించాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి పూర్తిగా కోలుకునేంతవరకు ప్రవేట్ ఇంజనీర్ మరియు కాంట్రాక్టర్ వారే ఆసుపత్రి ఖర్చులు భరించాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా మున్సిపాలిటీ అధికారులు భవన నిర్మాణం చేపడుతున్నటువంటి వారికి పూర్తిగా అవగాహన కల్పించి, నిర్మాణ రహితంగా ఉన్నటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఐ. ఎఫ్.టి.యు నాయకులు ఎస్.బాలరాజు,బాబు,పి.వై.ఎల్ నాయకులు ఎస్.మునెప్ప,యూసఫ్,ఏఐకెఎంఎస్ నాయకులు పెద్దారెడ్డి,ఎల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకు సహకరించండి

**– జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్**



మన గళం,నంద్యాల కలెక్టరేట్ : స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకు అన్ని విధాల సహాయ సహకారాలు అందజేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్ కోరారు. డిఆర్ఓ ఛాంబర్ లో ఓటర్ల జాబితా రూపకల్పన పై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో డిఆర్ఓ సమావేశం నిర్వహించారు. సమావేశంలో బీఎస్పీ పార్టీ ప్రతినిధి కొట్టం శ్రీనివాసులు, సిపిఎం పార్టీ ప్రతినిధి పి.నరసింహులు, బిజెపి పార్టీ ప్రతినిధి కే.చంద్రశేఖర్, టిడిపి పార్టీ ప్రతినిధి కే శివరాం రెడ్డి, వైఎస్ఆర్సిపి పార్టీ ప్రతినిధి సాయిరాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్ మాట్లాడుతూ స్వచ్ఛమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకు అన్ని విధాల సహాయ సహకారాలు అందజేయాలని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. బూతుల వారీగా ఓటర్ల జాబితాను రాజకీయ పార్టీ ప్రతినిధులకు అందజేశామని... ఈ మేరకు ఓటర్ల జాబితాలోని డెత్ ఓటర్లు, చేర్పులు, మార్పులు బూతు స్థాయి ఏజెంట్లతో పరిశీలించుకుని అభ్యంతరాలు ఉంటే సంబంధిత ఈఆర్ఓ, ఏఆర్ఓలకు తెలియజేయాలని డిఆర్ఓ రాజకీయ పార్టీ ప్రతినిధులకు సూచించారు. రాజకీయ పార్టీ ప్రతినిధులు సూచించిన అంశాలను ఎన్నికల సంఘానికి నివేదిస్తామని డిఆర్ఓ తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ 80 సంవత్సరాలు పైబడిన వారికి హెూం ఓటింగ్ ఎలా అవకాశం కల్పిస్తారో, అదే రీతిలో గర్భిణీ స్త్రీలకు కూడా కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిఆర్ఓ ను కోరారు. పురుష, మహిళ ఓటర్లకు కేటాయించిన పోలింగ్ బూతుల్లో కుటుంబ సభ్యులందరికీ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## ఊయల సేవ

మనగళం శ్రీశైలం: లోకకల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (16.05.2025) సాయంత్రం శ్రీస్వామిఅమ్మవార్లకు ఊయల సేవను నిర్వహించనున్నది. ప్రతి శుక్రవారం రోజు మరియు పౌర్ణమి, మూలానక్షత్రం రోజులలో ఈ ఊయలసేవ జరిపించ బడుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠిస్తారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ జరిపించబడుతుంది. అనంతరం ఊయలలో వేంచేబు చేయించిన శ్రీస్వామిఅమ్మవార్లకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజ జరిపించబడుతుంది. తరువాత చివరగా ఊయలసేవ నిర్వహించబడుతుంది. ఊయల సేవను పురస్కరించుకుని శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషంగా పుష్పాలంకరణ, పుష్పార్చనలు




జరిపించబడుతాయి... పుష్పాలంకరణకు గాను పలుపుష్పాలు వినియోగించడం జరుగుతుంది

# నగరంలో భారీ వర్షం



మన గళం,కర్నూలు సిటి : మండుతున్న ఎండల ధాటికి విలవిలలాడిపోయిన కర్నూలు నగరవాసులు కాసింత సేద తీరారు. శనివారం సాయంత్రం 5.45 గంటల ప్రాంతంలో ఉన్నట్లుండి ఒక్కసారిగా వర్షం ప్రారంభమైంది. చిటపట చినుకులుగా ఆరంభమైన వర్షం క్రమ,క్రమంగా భారీ వర్షంగా మారింది. దాదాపుగా ఏకధాటిగా గంటన్నరకు పైగా కురిసిన వర్షంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఎండ వేడిమి ధాటికి అవస్థలు పడిన నగరవాసులు ఈ వర్షం రాకతో..కాస్తంత ఊరట పొందారు. ఉరుములు,మెరుపులతో కురిసిన ఈ వర్షంతో నగరంలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఈ వానతో పాదచారులు,వాహనదారులు రహదారులపై రాక,పోకల్లో కొంత ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షం ధాటికి విద్యుత్ సరఫరాలో కొంత అంతరాయం ఏర్పడింది. మొత్తం మీద ఏదేమైనా..వాన కురవడంతో కర్నూలు నగరవాసుల్లో కొంత హర్షం అయితే వ్యక్తమైందనే చెప్పవచ్చు.

# పార్ధివదేహానికి నివాళులు





మన గళం,కర్నూలు సిటి : టెక్సాస్‌లోని బ్యూమాంట్‌లో నివసిస్తూ, లామర్ విశ్వవిద్యాలయంలో మాస్టర్స్ చదువుతున్న కర్నూలు విద్యార్థి వెంకట కౌశల్ ఇస్నాల, అమెరికా, టెక్సస్ లో కారు నడుపుకుంటూ ఒక విషాదకరమైన రోడ్డు ప్రమాదంలో మరణించారు 12/05/2025 న రాత్రి 10-00 గంటలకు ఈ ప్రమాదం జరిగింది, అందులో మరణించాడు. ఇతని తండ్రి ఇస్నాల రవికుమార్ తొ పాటు అతని కుటుంబం తీవ్ర దిగ్భ్రాంతి, నిరాశకు గురైనారు, ఈ కష్ట సమయంలో అమెరికా అధికారులతో మాట్లాడి అక్కడి నుండి కర్నూలుకు మరణించిన అబ్బాయి పార్థివ దేహాన్ని తీసుకొని రావటానికి తక్షణ సహాయం అవసరం., ఈ అవసరం నిమిత్తం పెద్దలు టి జి వెంకటేష్ గారిని సంప్రదించిన వెంటనే వారు స్పందించి, అమెరికా లో ఉన్న తానా అధ్యక్షులు నిరంజన్ శృంగవరపు వారికీ, కర్నూలు లో ఉన్న తానా సభ్యులు పహాడ్ బాషా గారికి రామయ్య శెట్టి గారికి, అశోక్ కొల్లా గార్లకు, అలాగే వైశ్య నాయకులు యం. విట్టల్ శెట్టి లకు, ఈ విషయమై తెలియచేసి సహాయ సహకారాలు అందించమని కోరారు,. టీజీవీ కోరిక మేరకు అతని మృతదేహాన్ని భారతదేశము లోని కర్నూలు కు తిరిగి తీసుకురావడానికి మేము ఏర్పాట్లు చేస్తున్నాము మరియు వీసా నిబంధనలు, భీమా చర్యలు, ఇతర సంబంధిత లాంఛనాలతో సహాయం చేస్తున్నాము అని తెలియ చేసి ఈ రోజు మృతదేహాన్ని వారి కుటుంబ సభ్యులకు అందేలా చేశారు, ఈ పార్ధివదేహానికి టీజీ వెంకటేష్ పూలమాల వేసి నివాళులు అర్పించారు

# వేసవి తాపాన్ని అరికట్టేలా చర్యలు చేపట్టండి

**- స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా**



మన గళం,నంద్యాల కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొని పరిశుభ్రత కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. శనివారం పాణ్యం మార్కెట్ యార్డులో నిర్వహించిన స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో డిపిఓ శివారెడ్డి, తహశీల్దార్ నరేంద్ర నాథ్ రెడ్డి, ఎంపిడిఓ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొని స్వర్ణాంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దేందుకు తోడ్పాటు అందించాలన్నారు. ఈ మాసం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రజలందరూ వేసవి తాపాన్ని అరికట్టేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం సూచించిందన్నారు. అనంతరం సమీపంలోని ఇసుక డంప్ ను జిల్లా కలెక్టర్ పరిశీలిస్తూ హౌసింగ్ లబ్ధిదారులకు అవసరమైన ఇసుకను ఈ డంప్ ద్వారా అందజేసి వేగవంతంగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన చలువ పందిళ్లను పరిశీలిస్తూ ఆర్టీసీ ఆర్ఎంతో సమన్వయం చేసుకొని వీలైనంతవరకూ చలువ పందిళ్లను పెంచే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఆర్టీసీ ప్రాంగణంలో నిర్మిస్తున్న మరుగుదొడ్లను త్వరితగతిన పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులో తేవాలన్నారు. బస్ స్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంప్ ను పరిశీలించి అక్కడ ప్రయాణికులకు అందిస్తున్న వైద్య సేవలపై కలెక్టర్ వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా చలివేంద్రాల చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచటంతో పాటు స్వచ్ఛమైన త్రాగునీరు అందజేయాలన్నారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను పరిశీలిస్తూ ఇంటింటి చెత్త సేకరణ పై ఆరా తీసి తడి చెత్త పొడి చెత్త వేరు వేరు చేసి తయారుచేసే వర్మీ కంపోస్ట్ పై కలెక్టర్ ఆరా తీశారు. ఇంటింటి నుంచి సేకరిస్తున్న చెత్తను నిల్వ చేసుకోవడానికి స్థలం కేటాయించాలని సిబ్బంది కలెక్టర్ ను కోరగా అందుకు తగు స్థలాన్ని అన్వేషించాలని తహశీల్దార్ ను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం స్థానిక శిక్షణ కేంద్రాన్ని పరిశీలించి మరింత మెరుగైన రీతిలో శిక్షణ కేంద్రాన్ని తీర్చిదిద్దాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ ఏడాది జనవరి నుండి ప్రతినెలా ఒక థీమ్ తో పరిశుభ్రత కార్యక్రమాలు విస్తృతంగా చేపడుతున్నామన్నారు. జనవరిలో న్యూ ఇయర్ క్లీన్ స్టార్ట్, ఫిబ్రవరి మాసంలో సోర్స్ - రిసోర్స్, మార్చి మాసంలో సింగిల్ యూస్ ప్లాస్టిక్ - ప్రమోట్ రీ యూజబుల్, ఏప్రిల్ మాసంలో ఇ-చెక్, ఈ మే మాసంలో "బీట్ ది హీట్" (వేడిని ప్రభావాలను తగ్గించడం) అనే థీమ్ తో కార్యక్రమాలు చేపట్టామని కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగా ప్రధాన ట్రాఫిక్ కూడళ్ల వద్ద షేడ్ నెట్స్, త్రాగు నీటి సదుపాయం కల్పించడం జరిగిందన్నారు. ముఖ్యంగా వేడి తీవ్రతను తగ్గించడానికి రూఫ్ టాప్ గార్డెనింగ్, ప్లాంటేషన్ కార్యక్రమాలను చేపట్టాలన్నారు. పాణ్యం మండల కేంద్రంలో అన్ని ప్రాంతాలు పరిశు భ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం కలెక్టర్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలందరి చేత స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు.

# అంకాళమ్మ వారికి విశేష పూజలు



మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం శ్రీశైలక్షేత్ర గ్రామదేవత అయిన శ్రీ అంకాళమ్మవారికి ఈ రోజు (16.05.2025) ఉదయం అభిషేకం, విశేష పూజలను నిర్వహించడం జరిగింది. ప్రతీ శుక్రవారం రోజున శ్రీఅంకాళమ్మవారికి దేవస్థానం సేవగా (సర్కారిసేవగా) ఈ విశేషపూజ జరిపించబడుతోంది. ఇందులో భాగంగా శ్రీఅంకాళమ్మవారికి అభిషేకం, విశేషఅర్చనలు, పుష్పాలంకరణ, కుంకుమార్చనలు జరిపించబడ్డాయి. కాగా శ్రీశైల క్షేత్రానికి గ్రామదేవతగా చెప్పబడుతున్న అంకాళమ్మ ఆలయం, ప్రధాన ఆలయానికి ఎదురుగాగల రహదారికి చివరలో కుడివైపున ఉత్తరముఖంగా ఉంది. ప్రకృతి శక్తుల యొక్క కళలే గ్రామ దేవతలని దేవీభాగవతంలో చెప్పబడింది. కాగా ఈ ప్రకృతి అంతా ఆదిపరాశక్తి స్వరూపమేనని మన ఆర్షవాఙ్మయం చెబుతోంది. చతుర్భుజాలను కలిగిన ఈ దేవి నాలుగు చేతులలో కుడివైపున క్రింది నుండి పైకి వరుసగా కత్తి, సర్పంలో చుట్టబడిన డమరుకం ఉండగా, ఎడమవైపున పానపాత్ర, త్రిశూలం ఉన్నాయి. కిరీట మకుటం గల ఈ దేవి వస్త్రాలంకురాలై కర్ణాభరణాలను, కంఠాభరణాలను కలిగి ఉంటుంది. కాగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజ జరిపించబడింది. ఆ తరువాత లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు. అనంతరం పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, పుష్పోదకం, విశేష అభిషేకం అర్చనలు నిర్వహించబడ్డాయి.

# ఇద్దరు రైతులకు కిసాన్ డ్రోన్ లను అందచేసిన ముఖ్యమంత్రి

మన గళం,కర్నూలు సిటి : ఇద్దరు రైతులకు కిసాన్ డ్రోన్ లను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అందచేశారు. శనివారం కర్నూలు నగరం లోని కేంద్రీయ విద్యాలయ సమీపంలో ప్రజా వేదిక కార్యక్రమంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ యాంత్రీకరణ - కిసాన్ డ్రోన్స్ స్టాల్, లను, స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర, స్టాల్, ఎకో సైన్, హిందుస్థాన్ రీసైక్లింగ్ హబ్, నానో బబుల్ మిషన్ పరిశీలించారు. ముఖ్యమంత్రి వ్యవసాయ యాంత్రీకరణ - కిషన్ డ్రోన్స్ స్టాల్ ను పరిశీలిస్తూ వ్యవసాయంలో డ్రోన్ కిసాన్ డ్రోన్ ను ఉపయోగిస్తున్న కోడుమూరు మండలం కొంగనపాడుకు చెందిన రాఘవేంద్ర గౌడ్ తో మాట్లాడారు. ఎన్ని ఎకరాలలో డ్రోన్ స్ప్రేయింగ్ చేశారు , రైతులకు ఎకరా మీద ఎంత లాభం వస్తుంది, సీజన్ పరంగా ఎంత లాభం వస్తుంది, అని వివరాలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు ... ఈ అంశం మీద ఒక ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్ సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి కలెక్టర్ ను ఆదేశించారు.. ఇంకా ఎక్కువ మంది రైతులకు డ్రోన్ లను ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కలెక్టర్ ను ఆదేశించారు.. స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర స్టాల్ ను పరిశీలిస్తూ నెలవారీగా కార్యక్రమాల నిర్వహణ బోర్డు ను పరిశీలించారు.. రీసైక్లింగ్ కంపెనీ స్టాల్ ను పరిశీలిస్తూ రాష్ట్రంలో ఉన్న 16 వేల గ్రామాలకు సంబంధించిన ప్లాస్టిక్, ఈ వెస్ట్, బ్యాటరీ తదితర డ్రై వేస్ట్ ను కలెక్ట్ చేసి టెండర్ లకు పిలుస్తామని అందులో పార్టిసిపేట్ అవ్వాలని ముఖ్యమంత్రి రీసైక్లింగ్ కంపెనీకి సూచించారు.. నానో బబుల్ టెక్నాలజీ స్టాల్ ను పరిశీలిస్తున్న సమయంలో అక్కడ ఉన్న ప్రతినిధి ఈ మెషిన్ గురించి ముఖ్యమంత్రి కి వివరిస్తూ ఈ మెషిన్ ను సరస్సులు, చెరువులలోకి పంపించిన ఎడల శు భ్రం చేస్తుందని, తెలుపగా 3 ప్రదేశాలలో ఉన్నటువంటి చెరువులలో ఈ మెషిన్ ను పంపించి ఎలా ఉపయోగకరంగా ఉందో తెలియచేయాలని ముఖ్యమంత్రి సంబంధిత అధికారిని ఆదేశించారు. క్రిష్ణగిరి మండలం పోతుకల్లు గ్రామానికి చెందిన పుచ్చలపల్లి సుందర రామయ్య రైతు గ్రూపు సభ్యుడు మార్కండేయులుకు, దేవనకొండ మండలం కరివేముల గ్రామానికి చెందిన బిస్మిల్లా గ్రూపు రైతు షేక్ బడే షా వలీ కి ముఖ్యమంత్రి కిసాన్ డ్రోన్ లను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు పొంగూరు నారాయణ, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రివర్యులు టి.జి.భరత్, రాష్ట్ర న్యాయశాఖ %డ% మైనార్టీ సంక్షేమ శాఖా మంత్రివర్యులు యన్.యండి. ఫరూక్,రాష్ట్ర రోడ్లు %డ% భవనాలు, మౌలిక వసతులు %డ% పెట్టుబడుల శాఖా మంత్రివర్యులు బి.సి.జనార్ధన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ భాషా, నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా తదితరులు పాల్గొన్నారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# సాంస్కృతిక కార్యక్రమాలు

మనగళం శ్రీశైలం : దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా (నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా) ఈ రోజు (16.05.2025) ఉదయశ్రీ నాట్య అకాడమీ, హైదరాబాద్ వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండి ఈ సంప్రదాయ నృత్య కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమములో




మహాగణపతిం. శివ తాండవం, శంభో శివ శంభో, మహాదేవశంభో, జతిస్వరం, మూషికవాహన, నమశ్శివాయతే తదితర గీతాలకు ఉదయశ్రీ, తేజ, హర్షిత్రశ్రీ, శ్రీష్టి, సుధీక్ష, తదితరులు నృత్యప్రదర్శన చేయనున్నారు. కాగా ఈ నిత్య కళారాధనలో ప్రతిరోజూ హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయబడుతున్నాయి. శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ 500 పరిరక్షణలో భాగంగా నిర్వహించబడుతున్నాయి. నిత్యకళారాధన కార్యక్రమాలు

# కలెక్టరేట్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి

–జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్



నంద్యాల కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా సిబ్బంది కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ ఆవరణంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ రవికుమార్, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి డి.రాము నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాలు పంచుకుని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా కృషి చేయాలన్నారు. ప్రతి నెల ఒక థీమ్ తో కార్యక్రమాలను రూపొందించడం జరుగుతుందని, అందుకు అనుగుణంగా సిబ్బంది సహాయ సహకారాలు అందజేయాలన్నారు. అదే విధంగా కలెక్టరేట్ పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మన మీద ఎంతగానో ఉంటుందన్నారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణంలో స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించి సిబ్బంది అందరిచే ప్రతిజ్ఞ చేయించారు.

# ప్రజలకు ఆహ్లాదకరంగా ఉండే విధంగా స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర పార్క్‌ను సుందరీకరించండి

**స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర ఉద్యానవనం పార్క్ భూమి పూజ చేసి పైలాన్ ఆవిష్కరించిన రాష్ట్ర ముఖ్య మంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు**

మన గళం,కర్నూలు సిటీ : ప్రజలకు ఆహ్లాదకరంగా ఉండే విధంగా స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర పార్క్ ను సుందరీకరించాలని ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు .శనివారం కర్నూలు నగరంలోని ధనలక్ష్మి నగర్ జై రాజ్ ఇస్పాత్ లిమిటెడ్ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులలో భాగంగా 67 సెంట్ల విస్తీర్ణంలో రూ. 50 లక్షల వ్యయంతో నిర్మించనున్న "స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర ఉద్యానవనం పార్క్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రులు, శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు, అధికారులతో కలిసి పైలాన్ ను ఆవిష్కరించారు. పార్క్ విస్తీర్ణం, సుందరీకరణ గురించి జిల్లా కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ...సాయంకాలం ప్రజలు వచ్చి ప్రశాంతంగా కూర్చునే విధంగా ఈ పార్కును అభివృద్ధి చేయాలని, అందుకనుగుణంగా రాష్ట్ర పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి వర్యులు పొంగూరు నారాయణ సూచనలు తీసుకోవాలని ముఖ్యమంత్రి జైరాజ్ ఇస్పాత్ లిమిటెడ్ కంపెనీ యాజమాన్యాన్ని ఆదేశించారు...రెండు నెలల్లో స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర ఉద్యానవనం అభివృద్ధి పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పార్కులో సోలార్ లైటింగ్, ఫిట్నెస్ జోన్, మల్టీపర్పస్ లాన్, సీనియర్ సిటిజెన్ ఏరియా, చిల్డ్రన్స్ ప్లే ఏరియా, సిట్టింగ్ బెంచెస్, వాకింగ్ ట్రాక్, స్టోన్ గ్రావెల్ బెడ్ ఏర్పాటు చేసి బెస్ట్ పార్కుగా తీర్చిదిద్దాలన్నారు. పార్క్ నిర్వహణ కార్యక్రమాలు పకడ్బందీగా చేపట్టాలన్నారు. ప్లాంటేషన్ కార్యక్రమం ఈ పార్కు లో చాలా బాగా చేయించాలని అధికారులను ఆదేశించారు.. రాత్రి సమయంలో ఎటువంటి కార్యకలాపాలు జరగకుండా గేట్ లను మూసి వేయాలన్నారు.. అనంతరం స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర ఉద్యానవనం సుందరీకరణ వివరాలను ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఎండీ శ్రీనివాసులు ప్లెక్సీ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులకు వివరించారు.. అనంతరం ముఖ్యమంత్రి పార్కు లో చెట్టును నాటారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రివర్యులు టి.జి భరత్, న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు యన్. యం.డి ఫరూక్, ఆంధ్రప్రదేశ్ మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు పొంగూరు నారాయణ, కర్నూలు పార్లమెంట్ సభ్యులు



బస్తిపాటి నాగరాజు, నంద్యాల పార్లమెంట్ సభ్యులు డాక్టర్ బైరెడ్డి శబరి, జిల్లా కలెక్టర్ పి. రంజిత్ భాషా, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ , జిల్లా జాయింట్ కలెక్టర్ బి. నవ్య, ఎమ్మెల్సీ బి.తిరుమల నాయుడు, ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ మరియు బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ యం. కె. వి శ్రీనివాసులు, టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్క రెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే కే.యి శ్యామ్ కుమార్, ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పి. పార్థ సారథి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, ఆలూరు ఇంచార్జ్ వీరభద్ర గౌడ్, మంత్రాలయం ఇంచార్జ్ రాఘవేంద్ర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సి.క్యాంపు రైతు బజార్ విస్తరణకు రూ.6 కోట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు



మన గళం,కర్నూలు సి.క్యాంప్ : కర్నూలు నగరంలోని సి.క్యాంపు రైతు బజార్ ను విస్తరించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రూ.6 కోట్లు ప్రకటించారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. రైతు బజార్ లో స్వర్ణ ఆంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబుతో కలిసి మంత్రి టీజీ భరత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతు బజార్ విస్తరణకు సంబంధించిన ప్రతిపాదనలు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు మంత్రి భరత్ తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం వెంటనే మాట్లాడుతూ రూ.6 కోట్లతో రైతుబజార్ విస్తరణ చేపడతామని ప్రకటించారని మంత్రి టీజీ భరత్ చెప్పారు. పార్కింగ్ సౌకర్యం కూడా ఏర్పాటు చేయాలని, సంవత్సరం లోపు రైతు బజార్ విస్తరణ పనులు పూర్తి చేయాలని అధికారులను సీఎం ఆదేశించారన్నారు. ఇక్కడే అన్న క్యాంటీన్ కూడా ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారన్నారు. రైతు బజార్ విస్తరణకు నిధులు కేటాయించిన సీఎం చంద్రబాబుకు.. మంత్రి టీజీ భరత్ కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు ఓర్వకల్లు విమానాశ్రయం చేరుకున్న సీఎం చంద్రబాబు నాయుడుకు .. మంత్రి టీజీ భరత్ ఘనంగా స్వాగతం పలికారు.

## మినీ మహానాడు కార్యక్రమానికి కోడుమూరు నియోజకవర్గ ప్రజలందరికీ ఆహ్వానం



మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కర్నూలు పట్టణంలో రేపు అనగా 18/5/2025 ఆదివారం ఉదయం 10:00 గంటలకు కర్నూల్ జిల్లా పరిషత్ మీటింగ్ హాల్ నందు రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు కోడుమూరు నియోజకవర్గపు "మినీ మహానాడు" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాము. కావున కోడుమూరు నియోజకవర్గ ప్రజలు మరియు కోడుమూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సాధికారులు(కె ఎస్ ఎస్ ), బూత్ కన్వీనర్లు, బూత్ ఇన్చార్జులు, మండల, పట్టణ కమిటీ సభ్యులు, తప్పక హాజరై ఈ "మినీ మహానాడు" కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా అందరిని ఆహ్వానిస్తున్నాం

# ఆపరేషన్ సింధూర్ విజయవంతం

మన గళం డోన్ పట్టణంలో ఆపరేషన్ సింధూర్ విజయవంతంగా ముగిసిన సందర్భంలో సైనిక దళాలకు మద్దతుగా జాతీయ గౌరవంతో తిరంగా ర్యాలీ నిర్వహించబడింది.ఈ తిరంగా యాత్ర తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకు ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది.డోన్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ ముఖ్య అతిథిగా హాజరై,ర్యాలీని ముందుండి నడిపారు.ప్రజల మధ్యలో ఉన్న నాయకురాలిగా తన పాత్రను మళ్ళీ ఒకసారి వెల్లడించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న కోట్ల సుజాతమ్మ మాట్లాడుతూపహల్గాం అనే పేరు వినగానే ఆ విషాద సంఘటన మనసును కలిచివేస్తుంది. సరిహద్దుల్లో కంటికెంత రక్షణగా నిలిచే మన సైనికులు తమ ప్రాణాలను



పణంగా పెట్టి దేశాన్ని కాపాడుతున్నారు వారికి నా సెల్యూట్, ఆపరేషన్ సిందూర్ ద్వారా మన దేశం ఎంత ధైర్యంగా ఎదిరించగలదో మరోసారి నిరూపితమైంది" అని పేర్కొన్నారు.దేశభక్తిని ప్రతిబింబిస్తూ ప్రజలు, అధికారులు,ప్రజా ప్రతినిధులు,నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం ఈ ర్యాలీకి ప్రధాన ఆకర్షణగా నిలిచింది. యువత, మహిళలు, వృద్ధులు ఇలా అన్ని వయస్సుల వారు చురుగ్గా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## భారీ వర్షాలకు కూలిన గుడిసె,తీవ్రంగా నష్టపోయిన నిరుపేద కుటుంబం ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి బి. రాజు

మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు పట్టణంలో భారీ వర్షాలకు కూలిన గుడిసె,తీవ్రంగా నష్టపోయిన నిరుపేద కుటుంబం ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి బి. రాజు ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు కోడుమూరులో నిన్న రాత్రి కురిసిన భారీ వర్షం ఈదురుగాలులతో నిరుపేద కూలి గుడిసె కూలింది.వివరాలు ఇలా ఉన్నాయి పట్టణంలోని మా విజయ సూపర్ స్పెషలిటీ హాస్పిటల్ వెనుక పూరి గుడిసెలో బోయ.బజారి సాలమ్మల కుటుంబం నివసిస్తుంది. రాత్రి కురిసిన భారీ వర్షానికి, ఈదురు గాలులకు గుడిసె గోడ కూలడంతో పాటు రేకులు గాలికి ఏగిరిపోయాయి. దీంతో ఈ కుటుంబానికి నిలువ నీడ లేకుండా పోయింది.బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు.ఈ ప్రమాదంలో కుటుంబ సభ్యులకు స్వల్ప గాయాలు అయినట్లు సీపీఐ నాయకులు తెలిపారు.ఈ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిప్యూటీ తహషిల్దార్ కు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎఐటియుసి తాలూకా కార్యదర్శి రాముడు తదితరులు పాల్గొన్నారు.





## బెంగళూరులో షో టైమ్..

మన గళం వారం రోజులకుపైగా వాయిదా పడిన ఐపీఎల్ 18వ సీజన్ లీగ్ మ్యాచ్‌లు నేటితో పునః ప్రారంభం కానున్నాయి. హిటర్ల బ్యాటింగ్ మెరుపులు.. బౌలర్ల వికెట్ సంబురాలను చూడలేకపోయిన అభిమానులు ఇక పండుగ చేసుకోనున్నారు. ప్లే ఆఫ్స్ రేసు ఆసక్తికరంగా మారిన వేళ శనివారం బెంగళూరులో ఐపీఎల్ షో టైమ్‌కు కౌంట్‌డౌన్ మొదలైంది. చిన్నస్వామి స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(%=జదీ%)ను కోల్‌కతా నైట్ రైడర్స్ ఢీ కొడుతోంది. ఈ మ్యాచ్‌తో మళ్లీ ఐపీఎల్ సందడి మొదలవుతుండడంతో భారీగా ఫ్యాన్స్ మైదానానికి తరలి రానున్నారు. షెడ్యూల్ ప్రకారమే రాత్రి 7 గంటలకు టాస్.. 7:30గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. అయితే.. వర్ష సూచన ఉందని వాతావరణ శాఖ చెబుతోంది. దాంతో, ప్లే ఆఫ్స్ బెర్తును నిర్ణయించే కీలక జరుగుతుందా? లేదా? అని అందరిలో ఉత్కంఠ నెలకొంది. 18వ ఎడిషన్ ఆరంభంలో వరుసగా చిన్నస్వామిలో మూడుకు మూడు మ్యాచుల్లో ఓడింది ఆర్సీబీ. గుజరాత్ టైటాన్స్, ఢిల్లీ క్యాపిటల్స్, పంజాబ్ కింగ్స్ చేతిలో పరాజయం పాలైంది. అయితే. ఏప్రిల్ 24న రాజస్థాన్ రాయల్స్‌కు షాకిచ్చిన రజత్ పాటిదార్ బృందం సొంత ఇలాకాలో తొలి విజయం నమోదు చేసింది.

## బంగాళాఖాతంలో భారీ తుపాన్ తెలుగు రాష్ట్రాలకు 7 రోజులు భారీ వర్షాలు



మన గళం కర్నూలు: నైరుతీ రుతుపవనాలు జోరుమీదున్నాయి. నైరుతీ రుతుపవనాలు దూసుకువచ్చేందుకు అనుకూలమైన వాతావరణం ఉందని భారత వాతావరణశాఖ అధికారులు తెలిపారు. ఇప్పుడు నైరుతీ రుతుపవనాలు దక్షిణ అరేబియా సముద్రంలోని కొన్ని ప్రాతాలకు రానున్నాయి. అలాగే శ్రీలంక కింద ప్రాంతం, మాల్దీవులు, బంగాళాఖాతం దక్షిణ ప్రాంతం, అండమాన్ దీవులు, అండమాన్ సముద్రం అంతటా నైరుతీ రుతుపవనాలు విస్తరిస్తున్నాయి. రానున్న రెండు మూడు రోజుల్లో ఇవి మధ్య బంగాళాకాతంలోకి కూడా వస్తాయని ఐఎండీ తెలిపింది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఒక ఆవర్తనం ఉండటంతో మేఘాలు సముద్ర మట్టం నుంచి 3.1 కిలోమీటర్ల ఎత్తులో మొదలై... 5.8కిలోమీటర్ల వరకు విస్తరించి ఉన్నాయి. అలాగే మరో ఆవర్తనం..మధ్య బంగాళాఖాతంలో ఏర్పడింది. ఇది కోస్తాంధ్రకు దగ్గరలోనే ఉంది. దీని వల్ల సముద్ర మట్టం నుంచి 1.5కిలోమీటర్ల ఎత్తులో మేఘాటు, గాలులు గుండ్రంగా తిరుగుతున్నాయి. ఈ ఆవర్తనం త్వరలో అల్పపీడనంగా మారి తర్వాత తుపానుగా మారుతుందని అంచనా వేస్తున్నారు. దీనికి ఆట్రెడి శక్తి అనే పేరును కూడా పెట్టారు. ఈ శక్తి తుపాన్ వచ్చే రెండు వారాలపాటూ ప్రభావం చూపిస్తుందని అంచనా వేసింది. ఇక వచ్చే వారం రోజులపాటు ఏపీ, తెలంగాణలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు చాలా చోట్ల కురుస్తాయి. ఉరుములు, మెరుపులు, పిడుగులు పడతాయి.పిడుగుల శబ్దం చాలా ఎక్కువగా ఉంటుంది.గాలి వేగం గంటకు 30 నుంచి 50కిలోమీటర్లు ఉంటుంది. నేడు తెలుగు రాష్ట్రాల్లో గాలుల వేగం ఎక్కువగా ఉంటుంది. గంటకు 50 నుంచి 60కిలోమీటర్లు ఒక్కోసారి గంటకు 70 కిలోమీటర్ల వరకు ఉంటుందని ఐఎండీ తెలిపింది. రాయలసీమలో 19, 20 తేదీల్లో కూడా భయంకర ఈదురుగాలులు వీస్తాయని ఐఎండీ తెలిపింది. ఇక ఇటు తెలంగాణలో రోజంతా మేఘాలు పరుగులు పెడుతుంటాయి. సాయంత్రం4 తర్వాత వాతావరణం అల్లకల్లోలంగా మారే అవకాశం ఉంది. తర్వాత వర్షం మొదలవుతుంది. హైదరాబాద్ సహా తెలంగాణలోని 80శాతం ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురుస్తుంది. పశ్చిమ తెలంగాణలోని చాలా ప్రాంతాల్లో భారీ వర్షం పడుతుంది. ఇలా అర్ధరాత్రి వరకు కురవనుంది.భీకర గాలులు కూడా వీస్తాయి. ఏపీలోనూ రోజంతా మేఘాలు ఉంటాయి. మధ్యాహ్నం 3 తర్వాత తిరుపతి, చిత్తూరు ప్రాంతాల్లో వాన షురూ అవుతుంది. అది అంతకంతకూ పెరుగుతుంది. రాయలసీమలో చాలా ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయి. అలా రాత్రిమొత్తం కురుస్తూనే ఉంటుంది. ఆదివారం తెల్లవారుజామున 3 గంటల వరకు రాయలసీమలో వాన పడుతూనే ఉంటుంది. ఉత్తరాంధ్ర నేడు సాయంత్రం 4గంటలకు వర్షం మొదలై..భారీ వర్షంగా మారుతుంది. రాత్రి 8గంటల వరకు కురుస్తుంది. కోస్తాంధ్రలో నేడు సాయంత్రం జల్లులు కురిసే అవకాశం ఉంది.

## బెంగళూరులో భారీ వర్షం.. ఆర్సీబీ, కోల్‌కతా మ్యాచ్ టాస్ ఆలస్యం..!



మన గళం ఐపీఎల్ 18వ సీజన్ పునరుద్ధరణలో తొలి మ్యాచ్‌కోసం చిన్నస్వామి స్టేడియా నికి పోటెత్తిన అభిమానులకు షాకింగ్ న్యూస్. వాతావరణ శాఖ హెచ్చరించినట్టే.. మ్యాచ్‌కు వరుణుడు అంతరాయం కలిగిస్తున్నాడు. టాస్ సమయానికి ముందే బెంగళూరులో వర్షం మొదలైంది. అది కాస్త భారీ వానగా మారింది. దాంతో, 7 గంటలకు వేయాల్సిన టాస్‌ను వాయిదా వేశారు. చినుకులు తగ్గిన తర్వాత.. సిబ్బంది ఔట్ ఫీల్డ్‌ను సిద్ధం చేశాక మ్యాచ్ మొదలయ్యే అవకాశముంది. గత రెండు రోజులుగా బెంగళూరులో వాతావరణం మేఘావృతమై ఉంటోంది. మ్యాచ్ రోజైన శనివారం కూడా వర్ష సూచన ఉందని వాతావరణ శాఖ చెప్పింది. అయితే.. పదిరోజుల బ్రేక్ తర్వాత మ్యాచ్ చూసేందుకు ఫ్యాన్స్ భారీగా తరలివచ్చారు. కానీ, తీరా టాస్ వేయడానికి ముందే వర్షం అందుకుంది. ఒకవేళ మ్యాచ్ సాధ్యం కాకుంటే ప్లే ఆఫ్స్ రేసుకు ఒక్క విజయం దూరంలో ఉన్న ఆర్సీబీకి నిరాశ తప్పదు. ఈ ఎడిషన్‌లో అదరగొడుతున్న బెంగళూరు జట్టు ప్రస్తుతం 16 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. ఒకవేళ శనివారం కోల్‌కతాతో మ్యాచ్ రద్దయితే.. ఇరుజట్లకు ఒక్కో పాయింట్ వస్తుంది. అప్పుడు ఆర్సీబీ 17 పాయింట్లతో ప్లే ఆఫ్స్ రేసులోనే ఉంటుంది. అయితే.. మే 23న సన్‌రైజర్స్ హైదరాబాద్, మే 27న లక్నో సూపర్ జెయింట్స్‌పై కచ్చితంగా గెలిచి తీరాలి. వీటిలో ఒక్కటి ఓడినా 19 పాయింట్లతో రేసులో నిలుస్తుంది. కానీ, పంజాబ్, ఢిల్లీ, ముంబై.. ఫలితాలపై ఆర్సీబీ అవకాశాలు ఆధారపడి ఉంటాయి

## చరిత్రకు అడుగు దూరంలో కోహ్లీ.. డాషింగ్ ఓపెనర్ రికార్డు గల్లంతు..!





మన గళం ఐపీఎల్ 18వ సీజన్‌లో చేలరేగిపోతున్న విరాట్ కోహ్లీ చరిత్రకు అడుగుదూరంలో నిలిచాడు. ఈ ఎడిషన్‌లో ఇప్పటికే 7 హాఫ్ సెంచరీతో గర్జించిన విరాట్.. మరో ఒక ఫిఫ్టీ సాధించాడంటే ఈ లీగ్‌లో 'ఆల్‌టైమ్ రికార్డు' బద్ధలు కొడుతాడు. ప్రస్తుతం కోహ్లీ ఖాతాలో 62 అర్ధ శతకాలు ఉన్నాయి. భీకర ఫామ్‌లో ఉన్న ఈ రన్ మెషీన్ మరొకసారి బ్యాటు ఝులిపించి యాభైకి చేరువైతే%శా% డేవిడ్ వార్నర్ ను అధిగమిస్తాడు. ఐపీఎల్‌లో నిలకడగా రాణిస్తున్న ఆటగాళ్లలో కోహ్లీ ముందు వరుసలో ఉంటాడు. 2016లో నాలుగు సెంచరీలో రికార్డులు నెలకొల్పిన విరాట్.. ప్రస్తుతం అర్ధ శతకాలతోనూ ప్రకంపనలు సృష్టిస్తున్నాడు. ప్రస్తుతం అతడు 62 ఫిఫ్టీలతో డేవిడ్ వార్నర్‌తో సమానంగా ఉన్నాడు. ఆసీస్ ఓపెనర్ ఐపీఎల్‌కు దూరం కావడంతో అతడి రికార్డును బ్రేక్ చేసే సువర్ణావకాశం కోహ్లీకి రానుంది. శనివారం చిన్నస్వామి స్టేడియంలో కోల్‌కతాపై కింగ్ కోహ్లీ ఈ రికార్డు బ్రేక్ చేయాలని యావత్ ఆర్సీబీ ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.

Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310